# మంత్రులకు ల్యాండ్ క్రూజర్!

**అత్యాధునిక కార్లు కేటాయింపు ● కొత్తవి కొన్నారా? పాతవే ఇచ్చారా? ● సీఎం దుబారాపై నెటిజన్ల పెదవి విరుపు**



హైదరాబాద్, జూన్ 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మంత్రివర్గంలోని కొందరు మంత్రులకు కొత్తగా ల్యాండ్ క్రూజర్ కార్లను ప్రొటోకాల్ డిపార్ట్‌మెంట్ మంగళవారం కేటాయించినట్టు తెలిసింది. అయితే, కొత్తవి కొన్నారా? పాత వాహనాలనే మంత్రులకు ఇచ్చారా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. మరోవైపు కార్ల కోసం సీఎం దుబారా ఖర్చు చేస్తున్నారని నెటిజన్ల పెదవి విరుస్తున్నారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి కాన్వాయ్ కోసం కొత్తగా అత్యాధునిక వ్యవస్థ కలిగిన బుల్లెట్ ప్రూఫ్ కార్లను సీఎం సెక్యూరిటీ, ఇంటెలిజెన్స్ వింగ్ కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. ఒక్కో మంత్రికి రూ.2 కోట్ల విలువచేసే కొత్త ల్యాండ్ క్రూజర్‌లోని ప్రాడో వెర్షన్ కార్లను కొనుగోలు చేశారని సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. మరికొంతమంది గత ప్రభుత్వం కొనుగోలు చేసిన వాటినే.. మంత్రులకు కేటాయించారని చెప్తున్నారు. ఈ నేపథ్యంలో 2023 డిసెంబర్ 28న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడిన మాటలను ఉటంకిస్తూ నెటిజన్లు పోస్టులు పెట్టారు. 'పాత సీఎం కొత్తగా కాన్వాయ్‌ని సిద్ధం చేసుకున్నారు. కృష్ణా జిల్లా గన్నవరం మండలం వీరపనేనిగూడెం గ్రామంలోని మిల్లర్ త్రిహాయిని ఇంజినీరింగ్ కంపెనీలో వాటిని కేసీఆర్ దాచారు. నాకు కొత్తగా కార్లకు ఖర్చు పెట్టడం ఇష్టం లేదు' అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. అప్పటికి ఇంకా బుల్లెట్ ప్రూఫ్ పనులు మొదలే కాలేదు. రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే.. ఆ పనులను ఆపించి ఉండొచ్చు కదా.. తనకు అంతటి అధికారం ఉన్నా కూడా ఎందుకు ఆ పనులు ఆపించలేదని నెటిజన్లు ప్రశ్నించారు. కొత్తగా పెట్టే ఖర్చు గురించి మీడియా ముందు డైలాగులు చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ పని చేయలేకపోగా.. కేసీఆర్ మీద నెపం మోపి, బుల్లెట్ ప్రూఫ్ వాహనాల పనులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని అంటున్నారు. తనకు, తన మంత్రి వర్గానికి ఉపయోగపడతాయనే ఉద్దేశంతోనే ఆ పనులను కొనసాగించారని బీఆర్ఎస్ నాయకులు సైతం విమర్శిస్తున్నారు. ప్రస్తుతం మంత్రులకు కేటాయించినది ల్యాండ్ క్రూజర్-200 మోడల్. దీని ఎక్స్ షోరూం ధర రూ.2.10 కోట్లు ఉంటుంది. ఆన్‌రోడ్ రూ.2.50 కోట్లకుపైగా ఉంటుంది. రాజకీయ నాయకుల రక్షణార్థం దానికి బుల్లెట్ ప్రూఫ్ చేయడం వల్ల మొత్తం రూ.3 కోట్లు ఖర్చు అవుతుంది. శత్రువులు దాడులు చేస్తే.. ఈ బుల్లెట్ ప్రూఫ్ సమర్థంగా రక్షిస్తుంది.

## లోకం పోకడ




ఇంతకు ముందు పొలాల్లో పైర్లు ఉండేవి.. ఇప్పుడు వైర్లు ఉంటున్నాయి!

## తప్పుడు సమాచారం ఇస్తే కఠిన చర్యలు

- త్వరలో నిర్మాణ సంస్థలను పిలిచి విచారిస్తాం
- బరాజ్‌లు సరిగా పనిచేస్తే ప్రజలకు మేలే
- కాళేశ్వరంపై న్యాయ విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్

హైదరాబాద్, జూన్ 11 (నమస్తే తెలంగాణ): తమ విచారణకు హాజరైన అధికారులతో.. వారిచ్చే సమాధానాలను, వారికి తెలిసిన అంశాలను అఫిడవిట్ రూపంలో ఇవ్వాలని ఆదేశించామని కాళేశ్వరంపై ఏర్పాటుచేసిన న్యాయ విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ తెలిపారు. తప్పుడు సమాచారం ఇచ్చినట్టు తేలితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జలసౌధలో మంగళవారం ఆయన మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల నిర్మాణ బాధ్యతలను పర్యవేక్షించిన ఇంజినీర్ల విచారణ కొనసాగుతున్నదని చెప్పారు. మంగళవారం 20 మందితో సమావేశం అయినట్టు తెలిపారు. వారి నుంచి మూడు బరాజ్‌లకు సంబంధించిన సమాచారం తీసుకున్నామని వెల్లడించారు. విచారణకు హాజరయ్యేవారంతా ఈ నెల 25వ తేదీలోపు అఫిడవిట్ ఫైల్ చేయాలని ఆదేశించామని చెప్పారు. ఇప్పటివరకు ఇంజినీర్లతో సమావేశం అయ్యామని, తదుపరి ఏం చేయాలో జాబితా సిద్ధం చేస్తామని తెలిపారు. త్వరలో నిర్మాణ సంస్థలను పిలిచి విచారిస్తామని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులో అధికారులు ఉంటే వాళ్లకు కూడా నోటీసులు ఇస్తామని చెప్పారు. ఇతరుల వద్ద ఏదైనా సమాచారం ఉంటే అఫిడవిట్ రూపంలో సమర్పించవచ్చని అన్నారు. బరాజ్‌లు సరైన రీతిలో ఉంటే ప్రజలకు లాభమేనని జస్టిస్ ఘోష్ అభిప్రాయపడ్డారు.

# చెయ్యి తడిపితేనే కరెంటు!

**వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్‌కు లంచం ● పదివేలు ముట్టచెబితే చకచకా పనులు ● కాదంటే ఏండ్లు గడిచినా దిక్కుండదు**

**కరెంటు ఇవ్వక ఎండిన పంట పొలాలు ● సీఎండీకి ఫిర్యాదు చేసినా పట్టింపు కరువు ● ఆగమైతున్నామంటున్న అన్నదాతలు**



విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేసి వైర్ కనెక్షన్ ఇవ్వకుండా వదిలేసిన దృశ్యం

మంచిర్యాల, జూన్ 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'వ్యవసాయానికి విద్యుత్తు కనెక్షన్ కావాల్నంటే ఏఈ సార్‌కు రూ.10 వేల నుంచి రూ.15వేలు ఇవ్వాలె.. నేరుగా ఇచ్చినా పర్లేదు. సారు ఇంకో నంబర్‌కు ఫోన్‌పే చేసిన పర్లేదు. డబ్బులిస్తే పది.. పదిహేను రోజుల్లో కొత్త పోల్స్ వేసి, కరెంట్ వైర్లు తీసి కనెక్షన్ ఇచ్చిపోతరు. లేదంటే ఏండ్ల తరబడి తిరిగినా కరెంట్ రాదు.' ఇదీ మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం విద్యుత్తు శాఖ అసిసెంట్ ఇంజినీర్ (ఏఈ) మిట్టపల్లి మల్లయ్య తీరు. 'సార్ చేతులు తడపందే కరెంట్ రాదు.. పొలాలు ఎండుతున్నా ఆయన మనసు కరగదు' అని ఊరి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో ఇలాంటి ఇబ్బందులు పడలేదని, 6 నెలల్లోనే ఆగమైనమని వాపోతున్నారు.

### ఎండిపోయిన వంద ఎకరాలు

ఇదే మండలం గొల్లపల్లికి చెందిన దాదాపు 25 మంది రైతులు కొన్ని రోజులుగా లో ఓల్టేజీతో ఇబ్బంది పడుతున్నారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ కావాలని 13 మంది రైతులు తలా రూ.3వేల చొప్పున జమ చేసివిద్యుత్తు శాఖకు డీడీ తీశారు. జనవరి 18, 2024లో డీడీ తీస్తే సార్‌కు డబ్బు ఇవ్వలేదనే ఒకే ఒక్క కారణంతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయలేదు. ఆ సమయానికి నీరందక దాదాపు 100 ఎకరాల్లో వరి ఎండిపోయింది. కరెంట్ లేక పొలాలు ఎండుతున్నయని ఓ రైతు విద్యుత్తు శాఖ సీఎండీకి ఫిర్యాదు చేశాడు. పొలం ఫొటోలను వాట్సాప్‌లో పంపి సమస్య వివరించాడు. దీనిపై సీఎండీ కార్యాలయం నుంచి ఏఈని వివరణ కోరితే అదే గ్రామంలో నీళ్లున్న వేరే పొలం ఫొటోలు తీసి పంపి సీఎండీనే తప్పుదోవ పట్టించాడు. ఆ ఫొటోలు రైతుకు పంపి నీళ్లున్నయట కదా? అని అడిగితే 'మీరు రండి సార్.. నీళ్లెక్కడున్నాయో చూపించండి' అంటూ ఆ రైతు పట్టుపట్టాడు. ఉన్నతాధికారులు వచ్చి ఏఈని తీసుకొని ఎండిన పొలం దగ్గరికి వచ్చి 'ఇదేనా మీరు నీళ్లున్నయని చెప్పి పంపిన ఫొటో' అని నిలదీయడంతో ఉలుకూ పలుకూ లేకుండా మిన్నకుండిపోయాడు. ఇక ఏఈపై చర్యలు తీసుకుంటారేమో అని రైతులు భావించినా ఉన్నతాధికారులు ఆయననే కొనసాగించారు. చేసేదేంలేక రైతులు ఏఈకి 10 వే లు ఫోన్ పే ద్వారా సమర్పించుకున్నారు. అయినా పని పూర్తికాలేదు.

### డీడీలు కట్టినా తప్పని తిప్పలు

ఈ వంద ఎకరాల్లో పొలాలున్న కొందరు రైతులు వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. స్తంభాల ఏర్పాటు, కనెక్షన్ కోసం డీడీలు కూడా చెల్లించారు. తీరా సార్‌కు ఎప్పుడు ఫోన్ చేసినా 'రేపు, మాపు' అంటూ ముఖం చాటేశాడు. మెండె వెంకట్ అనే రైతు ఈ ఏడాది జనవరిలో పోల్స్, వైర్లకు 36,500, ఆన్‌లైన్ డీడీ మరో 5,600 కట్టాడు. కాగితాల ఖర్చు కోసం వెంకట్ పక్క పొలం రైతును 1500 ఏఈకి పంపాడు. 'మేం రోజూ సార్‌కు ఫోన్ చేస్తున్నం. ఎప్పుడు చేసినా రేపు వస్తామని తప్పించుకుంటున్నడు. ఆయన నిర్లక్ష్యంతో ఎకరంన్నర పొలం ఎండిపోయింది. 60వేల దాకా నష్టం వచ్చింది. నాలాంటి బాధితులు మా ఊరిలో 15, 20 మంది దాకా ఉన్నరు. ఎక్కడికి రమ్మంటే అక్కడికి వచ్చి మరీ చెప్తారు. మాకు న్యాయం జరిగేలా చూడండి.' అని రైతు వెంకట్ వేడుకున్నాడు.



కరెంట్ కనెక్షన్ ఆలస్యం కావడంతో గొల్లపల్లిలో ఎండిన వరిపొలం (ఫైల్)

### డీడీలు కట్టినం.. పదివేలు ఇచ్చినం



**మాకు** ట్రాన్స్‌ఫారం కావాలని రైతులందరం కలిసి రూ.39వేలు డీడీ తీసినం. జనవరిలో దరఖాస్తు పెట్టుకుంటే మార్చిలో వచ్చి పనులు చేసిన్రు. అప్పటికే మా పంటలు ఎండిపోయినయ్. దరఖాస్తు చేసి నెల రోజులు చూసి సార్‌ను అడిగితే డబ్బులు కొట్టుమన్నడు. రూ.10వేలు వెంటనే ఆయన రెండో నంబర్‌కు ఫోన్‌పే చేసినం. అయినా పనికాలేదు. చివరికి ఎండిన పొలాల ఫొటోలు తీసి సీఎండీకి పంపినం. అప్పుడు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

**- విఘ్నేశ్, రైతు, గొల్లపల్లి**

### డీడీ కట్టి నాలుగేండ్లాయె



మా పంట పొలాలకు విద్యుత్ కనెక్షన్ కావాలని 2020 మార్చిల రూ.1,04,000 డీడీ కట్టినం. రెండేండ్లు నానబెట్టిన్రు. చివరికి లేబర్లు లేరంటే సొంత ఖర్చులతో స్తంభాలు వేయించుకున్నం. అదయినంక ఏదో ఎస్టిమేషన్ మారిందని మళ్లీ ఈ మధ్య అదనంగా 80 వేలు డీడీ కట్టించుకున్నరు. గతంలో ఎస్ఈ శేషారావు విచారణకు వచ్చినప్పుడు కూడా ఈ సమస్య చెప్పినం. **- జాడి శ్రీనివాస్, రైతు గొల్లపల్లి**

### విచారణ జరిపి చర్యలు..

**గొల్లపల్లిలో** 30 మంది రైతులు డీడీలు తీశాక విద్యుత్తు కనెక్షన్లు పెండింగ్‌లో ఉన్నట్టు ఫిర్యాదు వచ్చింది. మంగళవారం గ్రామానికి వెళ్లి రైతులను ఆరా తీశాం. కనెక్షన్ల కోసం ఏఈకి ఫోన్ పే ద్వారా డబ్బు చెల్లించినట్టు రైతులు చెప్పారు. దీనిపై పూర్తిస్థాయి విచారణకు వరంగల్‌లోని ఉన్నతాధికారులకు పంపించాం. రిపోర్టు ఆధారంగా చర్యలుంటాయి.

**-శ్రావణ్‌కుమార్, ఎస్ఈ, విద్యుత్ శాఖ, మంచిర్యాల జిల్లా.**

## వానకాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 39.0°c | 27.0°c |
| రంగారెడ్డి | 38.3°c | 22.3°c |
| మెదక్ | 37.9°c | 22.7°c |
| మహబూబ్‌నగర్ | 37.5°c | 27.2°c |
| ఖమ్మం | 37.0°c | 27.0°c |
| కరీంనగర్ | 37.0°c | 27.0°c |
| నల్లగొండ | 36.0°c | 24.8°c |
| వరంగల్ | 36.0°c | 27.0°c |
| నిజామాబాద్ | 35.1°c | 26.3°c |
| హైదరాబాద్ | 31.7°c | 24.4°c |



## రాష్ట్రవ్యాప్తంగా విస్తరించిన నైరుతి

**మరో మూడురోజులు వర్షాలు**

హైదరాబాద్, జూన్ 11 (నమస్తే తెలంగాణ): నైరుతి రుతుపవనాలు రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాయి. వీటి ప్రభావంతో రాష్ట్రంలో వచ్చే మరో మూడురోజులపాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. బుధ, గురు, శుక్రవారాల్లో వివిధ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఆయా రోజుల్లో ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఈదురుగాలులతోపాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుందని పేర్కొన్నది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో కూడిన ఈదురుగాలులతోపాటు వర్షాలు కురుస్తాయని పేర్కొన్నది. వర్షాల నేపథ్యంలో రాష్ట్రంలో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా దిగువకు చేరాయి. మంగళవారం నల్లగొండ, సూర్యాపేట, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు పడినట్టు వాతావరణ శాఖ తెలిపింది.

## ఓఆర్ఆర్ వరకు డీఆర్ఎఫ్ బృందాలు: సీఎస్

హైదరాబాద్, జూన్ 11(నమస్తే తెలంగాణ): భారీ వర్షాలు, ఇతర విపత్తులను సమర్థంగా ఎదుర్కొని ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూసేందుకు జీహెచ్ఎంసీ డీఆర్ఎఫ్ (డిజాస్టర్ రెస్పాన్స్ బృందాలు) సేవలను ఓఆర్ఆర్ వరకు విస్తరించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి తెలిపారు. సీఎం ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. జీహెచ్ఎంసీ డీఆర్ఎఫ్ విభాగాన్ని మరింత పటిష్ఠ పరుస్తున్నామని, విపత్తులను ఎదుర్కోవడానికి అదనపు సిబ్బందిని, తగు యంత్ర పరికరాలను అందచేయనున్నామని సీఎస్ వివరించారు. ఇప్పటికే, జీహెచ్ఎంసీ పరిధిలో 30 డీఆర్ఎఫ్ బృందాలు పనిచేస్తున్నాయని, వీటికి తోడు మరో 15 బృందాలను అదనంగా ఏర్పాటుచేస్తున్నట్టు పేర్కొన్నారు. హైదరాబాద్‌తోపాటు వరంగల్, కరీంనగర్, ఖమ్మం తదితర నగరాల్లోనూ డీఆర్ఎఫ్ బృందాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, జీహెచ్ఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఆమ్రపాలి, జీహెచ్ఎంసీ ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భూముల ధరల పెంపుపై అధ్యయనం

హైదరాబాద్, జూన్ 11(నమస్తే తెలంగాణ): భూముల మార్కెట్ విలువ పెంపు ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. ఎంతమేర పెంచవచ్చో అధ్యయనం చేయాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులను రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ మంగళవారం ఆదేశించారు. ఇప్పటికే జిల్లా స్థాయిలో కలెక్టర్ నేతృత్వంలో, సబ్ రిజిస్ట్రార్ నేతృత్వంలో కమిటీలను సిద్ధం చేశారు. ఇప్పటికే ఎక్కడెక్కడ ఎంతమేర పెంచాలో అంచనాలను రూపొందించినట్టు తెలిసింది. తాజా ఆదేశాలతో బహిరంగ మార్కెట్ ధరలకు, ప్రభుత్వ ధరలకు మధ్య వ్యత్యాసాన్ని అధికారులు అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నారు.

## విద్యుత్తు ఒప్పందాలపై కేసీఆర్‌కు లేఖ

- ఈ నెల 15లోగా వివరణ ఇవ్వాలన్న కమిషన్
- జూలై 30 వరకు గడువు కోరిన మాజీ సీఎం
- గడువులోగా నివేదిక ఇవ్వాలన్న జస్టిస్ నర్సింహారెడ్డి
- మొత్తం 25 మందికి లేఖలు రాసినట్టు వెల్లడి

హైదరాబాద్, జూన్ 11 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు కొనుగోలు ఒప్పందాలపై విచారణ జరుపుతున్న ఏకసభ్య కమిషన్ మాజీ సీఎం కే చంద్రశేఖర్‌రావుకు కూడా వివరణ కోరుతూ లేఖ రాసింది. ఈ నెల 15లోగా వివరణ ఇవ్వాలని ఆయనను కోరింది. కమిషన్ చైర్మన్ జస్టిస్ ఎల్ నర్సింహారెడ్డి బీఆర్‌కే భవన్‌లో మంగళవారం మీడియాతో మాట్లాడారు. తాము విచారణ జరుపుతున్న అంశంపై మొత్తం 25 మందికి లేఖలు రాశామని తెలిపారు. వీరిలో మాజీ సీఎం కేసీఆర్ ఒక్కరే రాజకీయ నాయకులని చెప్పారు. మిగిలినవారంతా ఈ అంశంతో సంబంధం గలవారేనని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌కు ఏప్రిల్‌లోనే లేఖ రాశామని, అయితే ఎన్నికలున్నాయన్న కారణంతో సమాధానమివ్వలేదని, సమయం కావాలని అడిగారని తెలిపారు. ఎన్నికల దృష్ట్యా జూలై 30 వరకు సమయమివ్వాలని కేసీఆర్ కోరారని చెప్పారు. అయితే తమకు ప్రభుత్వం విధించిన గడువులోగా నివేదిక ఇవ్వాల్సి ఉన్నందున జూన్ 15 లోపు వివరణ ఇవ్వాలని కేసీఆర్‌కు సూచించామని తెలిపారు. ఆయన ఇచ్చే వివరణ సంతృప్తికరంగా లేకపోతే కమిషన్ ముందు ప్రత్యక్ష విచారణకు హాజరుకావాల్సి ఉంటుందని అన్నారు. అధికారుల నుంచే కాకుండా అనధికారుల నుంచి కూడా సమాచారం సేకరిస్తున్నామని చెప్పారు. అప్పట్లో ఏం జరిగిందో అధికారుల ద్వారా తెలుసుకుంటున్నామని అన్నారు. విద్యుత్తు సంస్థలకు చెందిన మాజీ సీఎండీలు, ప్రస్తుత సీఎండీతో కూడా సమావేశమయ్యామని చెప్పారు. మాజీ సీఎండీ ప్రభాకర్‌రావు, అప్పటి ప్రిన్సిపల్ సెక్రటరీ సురేశ్‌చందాతో సోమవారం సమావేశమై వారి నుంచి వివరణలు తీసుకున్నామని తెలిపారు. కమిషన్ మంగళవారం ఎస్‌కే జోషి, అర్వింద్‌కుమార్ నుంచి వివరణలు తీసుకుంది. వారు ప్రత్యక్షంగా హాజరుకాకపోవడంతో.. వర్చువల్‌గా వారితో సమావేశమై వారి నుంచి సమాచారాన్ని సేకరించినట్టు తెలిసింది. త్వరలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అజయ్ మిశ్రాను సైతం విచారించే అవకాశమున్నట్టు తెలిసింది.

### మూడింటిపై విచారణ

ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్తు కొనుగోలు ఒప్పందం, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ ప్లాంట్స్‌పై విచారణ జరుపుతున్నామని జస్టిస్ నర్సింహారెడ్డి చెప్పారు. ఈ మూడింటికి టెండర్లు లేకుండా నామినేషన్ పద్ధతిలోనే పనులు అప్పగించారని అన్నారు. ఛత్తీస్‌గఢ్‌తో విద్యుత్తు ఒప్పందం, భద్రాద్రి, యాదాద్రి థర్మల్‌ప్లాంట్స్ నిర్మాణం.. ఈ మూడు నిర్ణయాలను అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ మాత్రమే తీసుకున్నదని, జెన్‌కోలకు సంబంధంలేదని అన్నారు. 2 రాష్ట్రాల మధ్య ఒప్పందం జరిగినప్పుడు కేంద్రానికి అధికారమివ్వాలని చెప్పారు. భారీగా నిధులు వెచ్చించి ఛత్తీస్‌గఢ్ నుంచి విద్యుత్తు కొనుగోలు చేసినట్టు ఆరోపణలున్నాయని తెలిపారు. ఈ మొత్తం ప్రక్రియలో ఎంత నష్టం జరిగిందనేది తేల్చాల్సి ఉందని అన్నారు. అంతటా సూపర్ క్రిటికల్ టెక్నాలజీ వాడితే భద్రాద్రిలో సబ్ క్రిటికల్ టెక్నాలజీ వాడారని పేర్కొన్నారు. యాదాద్రి ప్లాంట్ నిర్మాణపనులను నామినేషన్ పద్ధతిలో ఇచ్చారని, అయినా ఈ ప్లాంట్ నిర్మా ణం ఇంకా పూర్తికాలేదని అన్నారు. ఆగస్టు వర కు ఒక రైల్వేలైన్ అందుబాటులోకి తీసుకురావాల్సి ఉండగా, ఇంతవరకు నిర్మాణం పూర్తికాలేదని చెప్పారు. బీహెచ్ఈఎల్‌కు చెందిన అధికారుల నుంచే కాకుండా ప్రముఖుల నుంచి సైతం సమాచారాన్ని తీసుకుంటున్నామని తెలిపారు.

# పెట్టుబడి సాయం వాయిదా పద్ధతిలో?

▶ మొదటిపేజీ తరువాయి...



లేదు. దీంతో తమ పట్ల రైతుల్లో వ్యతిరేకత మరింత పెరుగుతుందనే ఆందోళన ప్రభుత్వంలో నెలకొన్నది. ఈ నేపథ్యంలో వానకాలం సీజన్‌కు రైతుబంధు (రైతుభరోసా) పంపిణీపై ఏమి చేయాలని ఆలోచిస్తున్నది. ఇందులో భాగంగా పలు ప్రతిపాదనలు తెరపైకి వచ్చినట్టు తెలిసింది. ప్రస్తుతానికి పాత పద్ధతిలోనే పంపిణీ చేయాలని భావిస్తున్నట్టు తెలిసింది. రైతుల నుంచి డిమాండ్ పెరిగితే.. తొలుత ఎకరాకు రూ.5 వేల చొప్పున అందజేయాలని ఆలోచిస్తున్నట్టు సమాచారం. రైతుభరోసా విధివిధానాలు ఖరారైన తరువాత అర్హులైన రైతులకు మరో రూ.2,500 చొప్పున ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలిసింది. ఇది ఎంతవరకు సాధ్యమవుతుందనే దానిపై కూడా వ్యవసాయ శాఖ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. దీనిని రైతులు ఏ మేరకు ఆమోదిస్తారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

### రైతుభరోసా మార్గదర్శకాలపై కార్యాచరణ ఏదీ?

సీజన్ ఆరంభంలో రైతులకు పెట్టుబడి గోస తీర్చడం, సాగు విస్తీర్ణంతోపాటు వ్యవసాయ ఉత్పత్తి, ఉద్పాకత పెంచాలనే ఉదాత్త లక్ష్యాలతో కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని అమలుచేసింది. ఈ ఆశయానికి అనుగుణంగా ఎకరాకు సీజన్‌కు రూ.5 వేల చొప్పున, ఏడాదికి రూ.10 వేలు పెట్టుబడి సాయంగా రైతులందరి ఖాతాల్లో జమ చేసేది. తాము అధికారంలోకి వస్తే రైతుభరోసా పేరుతో ఈ మొత్తాన్ని రూ.15 వేలకు పెంచుతామని కాంగ్రెస్ ఎన్నికల హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత యాసంగి సీజన్‌లో ఆ హామీని నిలబెట్టుకోలేకపోయింది. తాము కొత్తగా అధికారంలోకి వచ్చినందున ప్రస్తుతానికి పాత పద్ధతిలోనే రైతుబంధు ఇచ్చి, వానకాలం సీజన్ నుంచి రైతుభరోసా అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. రైతుభరోసా విధివిధానాలపై అసెంబ్లీలో చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి అప్పుడే స్పష్టంచేశారు. అయితే, అసెంబ్లీలో ఎప్పుడు చర్చిస్తారు? ఎప్పుడు నిర్ణయం తీసుకుంటారనే అంశంపై ఇప్పటికీ స్పష్టత లేదు. మరోవైపు, రైతుభరోసా విధి విధానాల రూపకల్పనకు ఇప్పటివరకు కనీస కార్యాచరణ కూడా మొదలుకాలేదు. ఇందుకు సంబంధించి ఇప్పటివరకు తమకు ఎలాంటి ఆదేశాలు రాలేదని వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి.

### రైతుల ఎదురుచూపులు

**వ్యవసాయ** సీజన్ మొదలుకావడంతో రైతులు సాగు పనుల్లో బీజీగా ఉన్నారు. రైతుబంధు పెట్టుబడి సాయం కోసం ఎదురుచూస్తున్నారు. సకాలంలో పెట్టుబడి సాయం అందితే, విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు ఇబ్బంది ఉండదని ఆశ పడుతున్నారు. పెట్టుబడి సాయం పంపిణీపై ప్రభుత్వం నుంచి ఎలాంటి సంకేతాలు రాకపోవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. మొన్నటి యాసంగి మాదిరిగానే ఈసారి కూడా ఆలస్యం చేస్తారా? అనే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. మొన్నటి యాసంగిలో పెట్టుబడి సాయం పంపిణీని డిసెంబర్ 9న మొదలు పెట్టి మే 8వ తేదీతో పూర్తి చేసింది. సాగు సమయంలో ఇవ్వాల్సిన పెట్టుబడి సాయాన్ని పంటలు కోసిన తర్వాత అందించడం గమనార్హం. సకాలంలో పెట్టుబడి సాయం అందకపోవడంతో రైతులు అప్పుల కోసం మళ్లీ ప్రైవేటు వడ్డీ వ్యాపారులను, షావుకార్లను ఆశ్రయించాల్సిన దుస్థితి దాపురిస్తున్నది.

## సీఎంపై కేసు నమోదుకు ఆదేశించలేం

**ఓయూ సర్క్యులర్ వివాదంలో హైకోర్టు స్పష్టీకరణ**

**ఇతర ప్రత్యామ్నాయాలు చూసుకోవాలని విద్యార్థులకు సూచన**

హైదరాబాద్, జూన్ 11 (నమస్తే తెలంగాణ): నీరు, విద్యుత్తు కొరత వల్ల ఉస్మానియా వర్సిటీలో ఈ ఏడాది మే 1 నుంచి 31 వరకు వేసవి సెలవులు ప్రకటించారన్న సర్క్యులర్‌కు సంబంధించిన వివాదంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై కేసు నమోదుకు ఆదేశించలేమని మంగళవారం హైకోర్టు స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో చట్టపరమైన ఇతర ప్రత్యామ్నాయాలను చూసుకోవాలని విద్యార్థులకు సూచించింది. వర్సిటీ అధికారుల ఫిర్యాదు మేరకు ఇప్పటికే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారని జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి పేర్కొంటూ.. ఏది అసలైన సర్క్యులరో ఏది నకిలీ సర్క్యులరో పోలీసుల దర్యాప్తులో తేలుతుందని అన్నారు. ముఖ్యమంత్రిపై పోలీసులు కేసు నమోదు చేయకపోవడాన్ని సవాలు చేస్తూ ఓయూ విద్యార్థి సీహెచ్ దశరథ్, మరో ఐదుగురు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను ముగిస్తున్నట్టు ప్రకటించారు.



## 70 ఏండ్లు పైబడిన పెన్షనర్లకు అదనపు పింఛన్

హైదరాబాద్, జూన్ 11 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 70ఏండ్లకు పైబడిన పెన్షన్ దారులకు, కుటుంబ పెన్షన్‌దారులకు అదనపు పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. పే రీవిజన్ కమిషన్ సిఫారసుల మేరకు ఆర్థికశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. 70 నుంచి 75 ఏండ్లలోపు వారికి బేసిక్ పెన్షన్‌పై 15శాతం, 75 నుంచి 80 ఏండ్లలోపు వారికి 20శాతం, 80 నుంచి 85 ఏండ్లలోపు వారికి 30శాతం, 90 నుంచి 95 ఏండ్లలోపు వారికి 50శాతం, 95 నుంచి 100 ఏండ్లలోపు వారికి 60శాతం, 100ఏళ్లకు పైబడిన పెన్షనర్లకు, కుటుంబ పెన్షన్‌దారులకు 100శాతం అదనంగా పెన్షన్ ఇవ్వనుంది.

## తెలంగాణకు 2,937 కోట్లు

**కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు వాటా పంపిణీ**

హైదరాబాద్, జూన్ 11 (నమస్తే తెలంగాణ): కేంద్ర పన్నుల్లో వాటా కింద రాష్ట్రాలకు తాజాగా రూ.1,39,750 కోట్లు విడుదల య్యాయి. అందులో తెలంగాణకు రూ.2,937.58 కోట్లు పంపిణీ చేశారు. అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌కు రూ.25,066.88 కోట్లు, బీహార్‌కు 14,056.12 కోట్లు, మధ్యప్రదేశ్‌కు 10,970.44 కోట్లు, పశ్చిమ బెంగాల్‌కు 10,513.46 కోట్లు, ఏపీకి 5,655.72 కోట్లు విడుదల చేశారు. కేంద్ర పన్నుల్లో వాటా కింద ప్రస్తుత 2024-25లో ఇప్పటివరకు రాష్ట్రాలకు మొత్తం రూ.2,79,500 కోట్లు పంపిణీ చేసినట్టు మోదీ సర్కారు తెలిపింది.

## 7 తెలంగాణ మండలాలిస్తేనే ప్రమాణం చేశా

▶ మొదటిపేజీ తరువాయి...



తెలిపారు. దీంతో మోదీ ప్రభుత్వం మొదటి క్యాబినెట్ మీటింగ్‌లోనే ఆ ఏడు మండలాలను ఏపీలో విలీనం చేస్తూ నిర్ణయం తీసుకున్నదని, ఆర్డినెన్స్ జారీ చేసిందని వెల్లడించారు. ఇప్పటి మాదిరిగానే పదేండ్ల క్రితం 2014లో బీజేపీతో పొత్తుపెట్టుకున్న చంద్రబాబు ఏపీలో అధికారంలోకి వచ్చారు. నాడు కూడా కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయేలో టీడీపీ భాగస్వామ్యపక్షంగా కొనసాగింది. ఈ నేపథ్యంలోనే ఎన్డీయే ప్రభుత్వం 2014 జూలై 11న ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్ట సవరణకు ఆర్డినెన్స్ ద్వారా బిల్లు ప్రవేశపెట్టి, తెలంగాణకు చెందిన ఏడు మండలాలను ఏపీలో విలీనం చేసిన సంగతి తెలిసిందే. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని భద్రాచలం, పాల్వంచ రెవెన్యూ డివిజన్ల పరిధిలోని ఏడు మండలాలను ఏపీకి ధారాదత్తం చేసింది. ఈ చర్యను నాడు తెలంగాణలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నాడు తెలంగాణ ప్రజలు రాష్ట్రవ్యాప్తంగా బంద్ పాటించి కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రతిఘటించారు. ఆ తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఆమండలాలను తిరిగి ఇవ్వాలని నాటి సీఎం కేసీఆర్ స్వయంగా ప్రధాని మోదీని కలిసి ఎన్నిసార్లు విన్నవించుకున్నా, పట్టించుకున్న పాపాన పోలేదు. తాము కేంద్రంలో అధికారంలోకి వస్తే ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేసిన ఏడు మండలాలను తిరిగి తెలంగాణలో కలుపుతామని కాంగ్రెస్ మొన్నటి పార్లమెంట్ ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చింది. ఏడు మండలాల విలీనం విషయంలో కేంద్రంలోని బీజేపీ, ఏపీలోని టీడీపీ కలిసి చేసిన కుట్రను చంద్రబాబు స్వయంగా బయట పెట్టినప్పటికీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కానీ, ఆ పార్టీ నేతలు గానీ నోరు విప్పక పోవడం గమనార్హం. తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసిన ఏపీ టీడీపీ ప్రభుత్వం చేయబోయే ప్రమాణ స్వీకారానికి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ పెద్ద వెళ్తారా? లేదా? అన్నది ఆసక్తికరంగా మారింది. ఎన్డీయేలో కీలక భాగస్వామిగా ఉన్న చంద్రబాబు తెలంగాణకు వ్యతిరేకంగా మరెన్ని కుట్రలు చేస్తారోనన్న ఆందోళన తెలంగాణవాదుల్లో వ్యక్తమవుతున్నది.

> 'రాష్ట్రానికి అతి ముఖ్యమైన ప్రాజెక్టు పోలవరం. నాకు ఇప్పటికీ జ్ఞాపకం ఉన్నది. నేను 2014లో ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యాను. పోలవరం ప్రాజెక్టు వల్ల ముంపునకు గురయ్యే ఏడు మండలాలు తెలంగాణలో ఉన్నాయి. తెలంగాణ అనుమతి ఉంటే తప్ప, పునరావాసానికి ఒప్పుకుంటే తప్ప పోలవరం కట్టే పరిస్థితి లేదు. ఆరోజు రాజ్‌నాథ్‌సింగ్ బీజేపీ అధ్యక్షుడు, వెంకయ్యనాయుడు కూడా అప్పుడు యాక్టివ్‌గా ఉన్నారు. ఆ ఏడు మండలాలు ఆంధ్రప్రదేశ్‌కు ఇస్తే తప్ప ప్రాజెక్టు పూర్తి కాదు. ఏడు మండలాలు ఇవ్వకపోతే నేను ప్రమాణ స్వీకారం చేయను. నాకీ పదవి వద్దు అని స్పష్టంగా చెప్పాను. ఆ రోజు ప్రధాని నరేంద్రమోదీ ఇవన్నీ ఆలోచించి, ఫస్ట్ క్యాబినెట్ మీటింగ్‌లో పెట్టి, ఒక ఆర్డినెన్స్ ఇచ్చి ఆ ఏడు మండలాలు ఆంధ్రప్రదేశ్‌కి ఇచ్చి, ఆ తర్వాత పార్లమెంట్ సమావేశాలు పెట్టుకున్నారంటే అదొక చరిత్ర'.
>
> **- చంద్రబాబునాయుడు (అమరావతి ఏ కన్వెన్షన్‌లో మంగళవారం జరిగిన టీడీపీఎల్పీ సమావేశంలో)**